www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 14 నవంబర్ 2022

5

అన్నమయ్య



16 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండలంలోని చెన్నముక్కపల్లె ఉన్న లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 16 మందికి ఆపరేషన్లు చేశారు. రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వే కోడూరు, కె.వి.పల్లె, యర్రావారి పాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించిచారు. అందులో అర్హులైన 16 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు,వ ందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష, ఎపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు,ఆప్తమాలిక్ అసిస్టెంట్ రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధే లక్ష్యం

జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి పి.శ్రీనివాసులురెడ్డి



జిల్లాలో చేనేతలు కార్మిక కుటుంబాలకు అందుబాటులో ఉంటూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి పి. శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో చేనేత కార్మిక కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధి ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ద్వారా ఆయన వివరించారు.

ప్రజాశక్తి - రాయచోటి

ముఖా ముఖి..

జిల్లాలో మగ్గాలు, చేనేత కుటుంబాలు ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా 8,900 మగ్గాలు ఉన్నాయి. మదనపల్లె టౌన్, తంబలపల్లి నియోజకవర్గంలో కొత్తకోట, కూరబల కోటలో ఎక్కువగా ఉన్నాయి. 6500 చేనేత కుటుంబాలున్నాయి. వైఎస్ఆర్ నేతన్న నేస్తానికి 7000 దరఖాస్తులు వచ్చాయి. 6118 మంది లబ్ధి పొందారు. రూ. 24 వేలు అందజేశాం.

చేనేత కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి రుణాలు మంజూరు చేస్తోంది?

రాష్ట్ర ప్రభుత్వం ముద్ర ద్వారా చేనేత కార్మికులకు లక్ష రూపాయలు వరకు 15 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుంది.1060 లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 160 మంది కార్మికులకు అందజేశా. మార్చి నెల లోపు మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. అర్హుల కార్మికులు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ రుణాన్ని పెట్టుబడి సహాయంగా ఉపయోగించుకోవాలి.

జాతీయ చేనేత క్లస్టర్ పథకాల వివరాలు తెలపండి?

జాతీయ చేనేత క్లస్టర్ బతుకమ్మ ద్వారా జిల్లాలో రెండు క్లస్టర్లు మంజూరయ్యాయి. మదనపల్లె, అంగళ్లల్లో మంజూరయ్యాయి. మదనపల్లెలో రూ . కోటి 70 లక్షలు తో 300 మంది లబ్ధిదారులతో పూర్తి చేశాం . అంగళ్లలో రూ. కోటి 28 లక్షల తో 268 మంది లబ్ధిదారులకు మంజూరు చేశాం. ప్రస్తుతం పనులు చేస్తున్నార. జిల్లాలో మూడు క్లస్టర్లకు ప్రతిపాదనలు పంపాం.

కార్మికులకు పనిముట్లు అందజేస్తున్నారా?

కేంద్ర ప్రభుత్వం క్లస్టర్ పథకం ద్వారా లక్ష్యం పొందేలా కార్మికుల పనిముట్లు కోసం 90 శాతం రాయితో మంజూరు చేస్తుంది. చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవచ్చు. వర్క్ షెడ్లు కట్టుకొనడానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తుంది .

సహకార సంఘాల్లో ఎన్ని ఉన్నాయి?

జిల్లా వ్యాప్తంగా చేనేత సహకార సంఘాలు 55 ఉన్నాయి. ప్రస్తుతం 18 సంఘాలు పనిచేస్తున్నాయి. మిగిలిన సంఘాలను పనిచేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు జిల్లా వ్యాప్తంగా 50 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ రూ. 2500 చేనేత పింఛన్లు అందజేస్తున్నాం. 3661 మందికి ప్రస్తుతం వస్తున్నాయి. జిల్లాలో ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు

ఇంకెన్నాళ్లీ ఇక్కట్లు...?

- ఆర్‌యుబి నిర్మాణమెప్పుడో?
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు
- రైల్వే గేటు పడిందంటే ఇక అంతే సంగతులు
- ఉన్న ఆర్‌యుబి నీటితో మునిగిపోతున్న వైనం



వర్షపు నీటితో మునిగిపోయిన పాత ఆర్‌యుబి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-నందలూరు

రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యుబి) నిర్మాణం ఎప్పుడా అని నందలూరు వాసులు ఎదురు చూస్తున్నారు. చాలా కాలం క్రితం దాదాపు రూ.కోటికిపైగా వెచ్చించి నందలూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆర్‌యుబి నిర్మాణం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. చినుకుపడితే ఆర్‌యుబి మొత్తం మునిగిపోయి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇటీవల దాదాపు నెల రోజులకుపైగా పూర్తిస్థాయిలో ఆర్‌యుబి మునిగిపోవడంతో ఇరువైపులా పట్టణ వాసులతో పాటు గ్రామాలకు చెందిన ప్రజలు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రైల్వేగేట్లు ఆ శాఖకు ప్రధాన సమస్యగా మారింది. రైల్వే శాఖ అనేక ప్రాంతాల్లోని రైల్వే గేట్లను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా అనేక రైల్వే గేట్లు తొలగించిన విషయం తెలిసిందే. నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో రైల్వే గేటు ఏర్పాటు చేశారు. గ్రామానికి ఇరువైపులా పట్టణం విస్తరించి ఉండడంతో పాటు వేల సంఖ్యలో గృహాలు, నివాస ప్రాంతాలు, వివిధ కార్యాలయాలు, పాఠశాలలతో పాటు రోడ్డుకు ఇరువైపులా గ్రామీణ ప్రాంతాలు కూడా అధిక సంఖ్యలో ఉన్నాయి. నిత్యం వాహన రాకపోకలు అధిక సంఖ్యలో సాగుతుంది. ఇలాంటి తరుణంలో రైల్వే గేట్లు తొలగించేందు కోసం రైల్వే శాఖ చాలా కాలం క్రితం రంగం సిద్ధం చేసింది. నందలూరులో రైల్వే గేట్లు ఎత్తివేసి భారీ ఆర్‌యుబి నిర్మాణం నిర్మించేందుకు రైల్వే శాఖ ఇప్పటికే పలుమార్లు సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఆర్‌యుబి నిర్మాణం ద్వారా అనేక గృహాలు, నివాస ప్రాంతాలు తొలగించాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధించి ఆయా నివాసాలకు నష్టపరిహారం అందించిన తర్వాతే ఆర్‌యుబి నిర్మాణం చేపట్టడానికి వీలవుతుంది. ఒకవైపు ట్రాఫిక్ సమస్య, మరోవైపు రైల్వేగేటు సమస్య, ఇంకోవైపు వర్షపు నీటితో మునిగిపోతున్న ఆర్‌యుబితో జనం ఏళ్లతరబడి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఆర్‌యుబి నిర్మాణం ఎప్పుడా అని నాగిరెడ్డిపల్లి వాసులు ఎదురుచూస్తున్నారు. ఇక ఆర్‌యుబి నిర్మాణం చేపడితే అరవపల్లిలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం నుండి రైల్వే గేటు అవతల ఉన్న నాగిరెడ్డిపల్లి క్రాస్ రోడ్డు వరకు నివాస గృహాలు నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకొని రైల్వేశాఖ ఆర్‌యుబి నిర్మాణం చేపట్టాలి. ఇది ఇలా ఉండగా కడప-రేణిగుంట నాలుగు లైన్ల జాతీయ రహదారి నాగిరెడ్డిపల్లి చివరలోని ఎర్రిపాపయ్యగారిపల్లి గ్రామం మీదుగా వెళ్తుండటం గమనార్హం. మరి ఇలాంటి తరుణంలో నందలూరు నుండి జాతీయ రహదారికి చేరుకోవాలంటే ఆర్‌యుబి సరిపోతుందా, లేక ఫ్లై ఓవర్ నిర్మాణం చేపడతారా అన్న విషయాలు తెలియాల్సి ఉంది. రైల్వే గేటు మీదుగా కాకుండా నందలూరు నుండి జాతీయ రహదారికి రోడ్డు అనుసంధానం చేయాలంటే కచ్చితంగా రైల్వే ట్రాక్ దాటాల్సి ఉంది. మరి ఇలాంటి తరుణంలో ప్రభుత్వం ఎక్కడ బ్రిడ్జి నిర్మాణం చేపడుతుందో అంతుబట్టని విషయంగా మారింది. నివాస గృహాలు, ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతుండడం గమనార్హం.



రైల్వే గేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారి

బాస్కెట్‌బాల్‌కు జట్టుకు వాల్మీకిపురం క్రీడాకారుడు ఎంపిక



బాస్కెట్‌బాల్ జాతీయ పోటీకి ఎంపికైన లలిత్ కుమార్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కంగ్రా జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుంచి జరగనున్న బాస్కెట్ బాల్ జాతీయ పోటీకి పట్టణానికి చెందిన క్రీడాకారుడు లలిత్ కుమార్ ఎంపికైనట్లు బాస్కెట్ బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 27న అమలాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో తన ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీకి ఎంపికైనట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన లలిత్ కుమార్ రాష్ట్ర జట్టులో చురుకుగా పాల్గొని, రాష్ట్ర జట్టు విజయానికి కృషి చేయాలని పులుపునిచ్చారు. వాల్మీకిపురం బాస్కెట్ బాల్ క్రీడకు పుట్టిన ఇల్లు అని, ఇక్కడ నుంచి ఎంతో మంది బాస్కెట్ బాల్ క్రీడాకారులు ఎన్నో మంచి పదవులు అధిరోహించారని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే మంచి ప్రతిభ, తెలివి తేటలు, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. తద్వారా తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, చదువుకున్న బడికి సేవ చేసే అవకాశం లభిస్తోందన్నారు. బాస్కెట్ బాల్ క్రీడపై ఆశక్తి కలిగిన క్రీడాకారులు సంప్రదిస్తే వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం లలిత్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు సుబ్రమణ్యం, శ్రీనివాసులు రెడ్డి, రవి, సాయిభార్గవ్, అంజిబాబు పాల్గొన్నారు.

16న పాత సామాన్లకు వేలం పాట

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని తరిగొండ రోడ్డులో ఉన్న ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు పాతసామాన్లకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సురేంద్రన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.3 వేలు ధరావత్తును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ప్రిన్సిపల్ పేరున డిడి తీసి వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ వేలం నందు పాతసామాన్లు, అల్యూమినియం, చెక్కసామాగ్రి, ప్లాస్టిక్ డ్రమ్ములు, స్టీల్ తదితర వాటిని బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -బి.కొత్తకోట

గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎం.తులసినాయక్ తెలిపారు. ఆదివారం తులసి మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన శాఖ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభోత్సవం, 15న పుస్తకాల ప్రదర్శన, 16వ తేదీన గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల నాయకుల స్మరించుట, 17వ తేదీన కవి సమ్మేళనాలు, సెమినార్లు, 18వ తేదీన పాఠశాల విద్యార్థులకు విదంశాలపై పోటీలు నిర్వహించుట, 19వ తేదీన మహిళా దినోత్సవ సందర్భంగా దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20వ తేదీన డిజిటల్ గ్రంథాలపై అవగాహన, ముగింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయ వారోత్సవాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. **రామాపురం:** గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఎంఎల్ఎ గడికోట మోహన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి వారోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. గ్రంథాలయ అధికారి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వారం రోజుల కార్యక్రమాల గురించి వివరించారు. స్థానికంగా ఉన్న విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. **తంబళ్లపల్లి:** స్థానిక గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి జిలానిబాషా తెలిపారు. వారోత్సవాలు20వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, క్విజ్, తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

'నిరుడు కురిసిన వెన్నెల' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక ప్రశాంత్ నగర్‌లోని జ్ఞానోదయ హైస్కూల్‌లో ప్రజా చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో 'నిరుడు కురిసిన వెన్నెల' పుస్తకాన్ని ఆదివారం గొల్లపూడి తిరు పతిరావు అధ్యక్షతన ఆవిష్క రించారు. సుప్రసిద్ధ కథ, నవలా రచయిత, అనువా దకులు, బహుగ్రంథకర్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అయిన జిల్లేళ్ళ బాలాజీ రచించిన నూతన పుస్తకాన్ని మదనపల్లె శాఖ గ్రంథాలయ సంస్థ అధికారిని వసంత, కామకోటి ప్రసాదరావు ఆవిస్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కథానిక పుట్టు పూర్వోత్తరాలు, ఆంధ్రదేశంలో తెలుగు కథ ప్రస్థానాన్ని గూర్చి ప్రసం గించారు. కార్యక్రమంలో జి.శ్రీధర్, టిఎస్ఎ.కృష్ణమూర్తి, జోలపాలెం భవానీ ప్రసాద్, అంజలి ఇండ్లూరి, బి.విజయలక్ష్మి, డాక్టర్ జ్ఞాని చంద్రశేఖర్, మానే వెంకటా చలపతి, పవన్ కుమార్, కొడవటి ప్రభాకర్, మాదాసు రెడ్డప్ప, శ్రీనివాసులు నాయుడు, ఆలూరి సురేష్, పండిత వాసా కృష్ణమూర్తి, అనిల్, ధర్మాధిపతి నాగభూషణరావు పాల్గొన్నారు.

'మధుమేహం పట్ల నిర్లక్ష్యం వద్దు'

ప్రజాశక్తి-పీలేరు

చర్మ వ్యాధులు, మధుమేహం విషయంలో నిర్లక్ష్యం మంచిది కాదని, ప్రాథమిక దశలోనే వాటిని గుర్తించి వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ నివారించుకోవాలని డాక్టర్ శ్వేతారాణి, డాక్టర్ కె.చైతన్యరెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీచక్ర ఆస్పత్రిలో స్థానిక, పరిసర ప్రాంత ప్రజల కోసం ఉచిత చర్మ వ్యాధులు, మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో పాల్గొన్న 250 మందికి ఉచిత వైద్యంతో పాటు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ జన్యు పరంగా చర్మ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నవారికి ఇన్‌ఫెక్షన్, మానసిక అందోళనప, చర్మానికి గాయం, హార్మోన్ల ప్రభావం, కొన్ని రకాల మందుల దుష్ప్రభావం వంటి ప్రేరేపకాలు తోడై ప్రభావం చూపుతాయని చెప్పారు. మధుమేహం కూడా జన్యుపరంగా, మనం తీసుకునే ఆహారంలో పిండి పదార్థాలు ఎక్కువగా ఉండడం వల్ల, శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడం, గంటలతరబడి కూర్చోని ఉండడం, అధికంగా కొవ్వు ఉండే పదార్థాలు, మాంసాహారం, బేకరీ పదార్థాలు, నిల్ల ఉండే పచ్చళ్ళు, తీపి పదార్థాలు, కొన్ని రకాల మందుల దుష్ఫరిమాణాలు ఈ వ్యాధికికారణం కావచ్చని పేర్కొన్నారు. కాస్త మన ఆహారపు అలవాట్లను మార్చుకుంటూ ప్రోటీన్, ఫైబర్ ఫుడ్ అంటే ఆకుకూరలు, పచ్చి కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన విత్తనాలు, మొదలగునవి ఆహారంగా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యానికి వ్యాయామం, మంచి ఆహారపు అలవాట్లు చాలా ముఖ్యమని తెలియజేశారు. వ్యాధుల పట్ల ఆందోళన పడాల్సిన పనిలేదని మందులతో వాటిని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ సందీప్ కుమార్, నిర్వాహకులు నాగేంద్ర నాయుడు, వైద్య సిబ్బంది నరేష్, లక్ష్మీప్రసన్న, లక్ష్మి, తులసి, ప్రజలు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

'అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అంగన్వాడీ కార్యకర్తలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సి.హెచ్.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో రమాదేవి అధ్యక్షతన అంగన్వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన రాయచోటిలో నిర్వహించే జిల్లా మహాసభను జయప్రతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిసి పట్ల చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని, అంగన్వాడీలను మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. హెల్పర్లను, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సూపర్‌వైజర్లుగా పదోన్నతిలో ప్రభుత్వం అంగన్వాడీల మధ్యన చిచ్చుకు ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. సీనియర్ అంగన్వాడీ కార్యకర్తలను సూపర్‌వైజర్లుగా నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయమే బూటకమని తెలిపారు. ప్రభుత్వం అవలంబిస్తున్న నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మీ మాట్లాడుతూ 2017 నుంచి టిఎ, డిఎలు చెల్లించకపోతే అధికారులు పెట్టే మీటింగ్లకు ఎలా హాజరు కావాలని ప్రశ్నించారు. ఈ నెల 13 నెల నుండి, కూరగాయల బిల్లులు చెల్లించకపోతే, పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు, ఎలా పౌష్టికాహారం అందించాలని నిలదీశారు. చాలీచాలని జీతాల్లో నుంచి ఖర్చు చేస్తున్నామన్నారు. తక్షణ బిల్లులు చెల్లించాలన్నారు. పాలకులు మారినప్పటికీ ఐసిడిఎస్ వ్యవస్థ పూర్తిస్థాయి అభివృద్ధికి నోచుకోలేకపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు డి.వనజ కుమారి, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాధాకుమారి, కోశాధికారి, జి.పద్మావతి ఉపాధ్యక్షులు, పి.సుధామణి, నిర్మల, సుజాత, లీలావతి, శంకరమ్మ, రెడ్డమ్మ, శుభ రత్నమ్మ నాగరత్న, మణెమ్మ, రాధా సహాయ కార్యదర్శులు, వై.సుజాత. పి.కనకదుర్గ, ఈశ్వరమ్మ, రోజా, ప్రభావతి, శిరీష, వెన్నెల. శ్రీదేవి సుశీల పాల్గొన్నారు.

క్రికెట్‌లో పవర్ హీటర్స్ జట్టు విజయకేతనం

ప్రజాశక్తి - గుర్రంకొండ

బాలల దినోత్సవం సందర్భంగా ఖాన్, అబ్దుల్ సమద్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లో పవర్ హిట్టర్స్ మెంటల్ బాయ్స్ జట్టుపై రెండు వికెట్ల తేడాతో పవర్ హీటర్స్ జట్టు విజయం సాధించింది. ఆదివారం గుర్రంకొండ ఫ్రెండ్స్ మైదానంలో జరిగిన క్రికెట్ పోటీలలో ముందుగా మెంటల్ బాయ్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. 8 ఓవర్లలో 72 పరుగులు చేశారు. అనంతరం పవర్ హీటర్స్ జట్టు 8 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 73 పరుగులు తీసి విజయం సాధించింది. అత్యధిక పరుగులు చేసిన మొహమ్మద్ హన్నన్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. మ్యాచ్ గెలుపొందిన వారికి మెడల్‌తో పాటు ట్రోఫీని గుర్రంకొండ జడ్‌పిటిసి అమ్రిన్ ముక్తియార్ అలీ ఖాన్ చేతుల మీదుగా విజేతలకు అందజేశారు.



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న జడ్‌పిటిసి ముక్తియార్ అలీఖాన్



మానవత సంస్థకు బాడీ ఫ్రీజర్‌ను ఇస్తున్న దాతలు

మానవత సేవలు అద్భుతం

ప్రజాశక్తి - రాయచోటి

మానవత సేవలు అద్భుతంగా ఉన్నాయని విజయలక్ష్మీ జువెలర్స్ దుకాణం యజమాని సుగవాసి జానకి రామ్, సుగవాసి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మాసాపేటలోని కీ.శే.సుగవాసి నారాయణ స్వామి, విజయలక్ష్మి జ్ఞాపకార్థం కౌన్సలర్ ఈశ్వర్ ప్రసాద్, సుగవాసి మురళీ దిగువ అబ్బవరం వైసిపి నాయకులు తిరుపాల్ నాయుడతో కలిసి మానవత రాయచోటిశాఖ చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి, అధ్యక్షులు కనపర్తి శివశంకర్ రెడ్డి,సెక్రెటరీ రామానాయుడు బాడీఫ్రీజర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ పేదలకు, అభాగ్యులకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా సమిష్టిగా సేవలు అందచేయడం చాలా అభినందనియమనీ కొనియాడారు. మానవత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతోనే మానవత ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా సేవలు చేస్తున్నట్లు వివరించారు. మానవత సేవలు గుర్తించి బాడీ ఫ్రీజర్ బాక్స్ అంద జేసిన సుగవాసి జానకి రామ్, సుగవాసి మురళి మోహన్ లకు మానవతా శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులు కేంద్ర కమిటీ సభ్యులు సహదేవ రెడ్డి, జిల్లా కన్వీనర్ వెంకట్రామి రెడ్డి(బాబు), వైస్ ప్రెసిడెంట్ సంచులు ఖాదర్ బాషా, కన్వీనర్ ఎన్.ఎం.డి షకీల్, మనోహర్ రెడ్డి, మనం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు శ్రీసీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సోమవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉదయం ఆలయంలో స్వామివారికి సుప్రభాతసేవతో కార్యక్రమాలను ప్రారంభించి, అర్చన, తోమాలసేవ, తదితర సేవా కార్యక్రమాల అనంతరం ఆస్థాన మండపంలో సీతారాముల వారిని అధిరోహింపజేసి కల్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన దంపతులు రూ.300 టికెటును కొనుగోలు చేసి, కల్యాణోత్సవంలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బిసిల అభ్యున్నతికి కృషి : 'బోడెం'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బిసిల ఐక్యత అభ్యున్నతికి బిసి హక్కుల పోరాట సమితి నిరంతరం కృషి చేస్తుందని బిసి హక్కుల పోరాట సమితి (బిసిహెచ్‌పిఎస్) వ్యవస్థాపకులు బోడెం రాజశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్ వేదికగా బిసి హక్కుల పోరాట సమితి నూతన కమిటీ సభ్యులకు నియమక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లె మండల బిసిహెచ్‌పిఎస్ అధ్యక్షులుగా పారేసు రాజగోపాల్‌ను నియమించారు. నూతన కమిటీల ఏర్పాటులో భాగంగా మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె మండల అధ్యక్షులుగా పారేసు రాజగోపాల్ నియమించామన్నారు. రాయలసీమ యూత్ కార్యనిర్వాహక కార్యదర్శిగా మణిశంకర్, జిల్లా గౌరవ అధ్యక్షులుగా పోతబోలు వెంకటరమణ, మదనపల్లె డివిజన్ గౌరవ అధ్యక్షులుగా గజ్జెల గంగాధర్, తాలూకా గౌరవ అధ్యక్షులుగా సుధాకర్, మదనపల్లె డివిజన్ ఉపాధ్యక్షులుగా గురుమూర్తిలను నియమించారు. ఈ సందర్భంగా బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న బిసి హక్కుల పోరాట సమితి గ్రామా స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి నూతన నియమకాలను చేపట్టడం జరిగిందని వివరించారు. ఈనెల 20వ తేది నిమ్మనపల్లె మండలంలో బిసి హక్కుల పోరాట సమితి ఆత్మీయ సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ సలహాదారు హరినాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగినేని గోవిందు, కార్యనిర్వాహక కార్యదర్శి మక్కినేని వేణుగోపాల్, అన్నమయ్య జిల్లా కార్యదర్శి బండి రామచంద్ర, అన్నమయ్య జిల్లా ప్రచార కార్యదర్శి బొమ్మనపల్లి లక్షుమన్న, నాయకులు రెడ్డి భాస్కర్, రమణ పాల్గొన్నారు.



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు



అన్నదానం చేస్తున్న యంగ్ ఇండియా సభ్యులు

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా సమితి సంస్థ నాల్గవ వార్షికోత్సవాన్ని పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ జ్యోతిచౌక్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా సేవ సమితి చేస్తున్న పలు కార్యక్రమాలను పలువురు కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, మాజీ సర్పంచ్ కుడుము శ్రీనివాసులు, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్ నక్క మహేష్, తలారి మంజునాథ్, పీజీర్, వినోద్, శ్రీనివాసులు, హరీష్, మధు, ఎల్లారెడ్డి, పవన్, మహేష్, అంజి, రమణ, మీసేవ రమణ, మని, రెడ్డెప్ప, నరేంద్ర, చిన్న, ఎరప్ప, రాజేష్, మూర్తి, మధు,సూరి,రెడ్డి బాషా, ప్రదీప్, అబ్దుల్, శివారెడ్డి, సూరి, నవీన్, పవన్ రాయల్, మంజు, చంద్రమోహన్, వెంకటేష్, పారేష్,, సతీష్, ప్రభాకర్, ఆనంద్, సురేష్ పాల్గొన్నారు.



పవర్‌టిల్లర్‌తో కలుపు మొక్కలు తీస్తున్న రైతు

కలుపు యంత్రంతో ఖర్చులు అదుపు

ప్రజాశక్తి-ములకలచెరువు

కలుపు యంత్రంతో ఖర్చులు అదుపు చేసుకోవచ్చని టి.సదుం పంచాయతీ అనంతాపురానికి చెందిన రైతు జ్యోతి నగరం కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎకరం పొలంలో మల్బరీ పంటను సాగుచేసినట్లు తెలిపాడు. మల్బరీ పంట మధ్యలో పెరుగుతున్న పిచ్చి మొక్కలు కలుపు తీయడానికి పవర్ టిల్లర్ యంత్రం ఎంతగానో ఉపయోగకరమన్నారు. రూ.500 పెట్రోల్ ఖర్చుతో నాలుగు గంటల సమయంలో ఎకరం పోలంలో కలుపు మొక్కలు తొలగించవచ్చని పేర్కొన్నాడు. కూలీలతో కలుపు మొక్కలు తొలగించాలంటే రూ.8 నుంచి రూ.10 ఖర్చవుతుందని తెలిపారు. పవర్ టిల్లర్ యంత్రాయం రూ.45 వెలు వెచ్చించి కొనుగోలు చేసినట్లు చెప్పారు. సాలుకు సాలుకు నాలుగు అడుగులు మూడు అడుగులు దూరంలో మొక్కలు నాటితే టమోటా పంటలో కూడా కలుపును తీయోచన్నారు. ప్రభుత్వం రైతులకు రాయితీపై పవర్ టిల్లర్‌లను పంపిణీ చేస్తే ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు.

మర్రిమాకులపల్లి మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని మర్రిమాకులపల్లి మాజీ సర్పంచ్, మల్లయ్య కొండ దేవస్థాన కమిటీ మెంబర్ నారాయణమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం అంతక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. వైసిపి మహిళా విభాగం జిల్లా కార్యదర్శి, సర్పంచ్ జ్యోతి, మల్లయ్య కొండ చైర్మన్ కెఆర్ మల్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు.



సుకుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న సిఎం సలహాదారు ధనుంజయరెడ్డి

సుకుమార్‌రెడ్డికి పితృ వియోగం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి శంకరరెడ్డి(82) ఆదివారం మృతి చెందారు. శంకర్‌రెడ్డి తిమ్మిశెట్టిపల్లి పంచాయతీ విఎంగా 35 ఏళ్లు, కోడూరు ఈస్ట్ వెస్ట్ విఎఒగా 12 ఏళ్లు పనిచేశారు. అనంతరాజుపేట పంచాయితీ తూర్పుపల్లెలో శంకర్‌రెడ్డి మృతదేహానికి ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి, ఎపిఎండిసి ఎమ్‌డి వెంకటరెడ్డి, సిపిఒ వెంకటరమణ, వైసిపి నాయకులు కొల్లం గంగిరెడ్డి, వ్యాపారవేత్త చియ్యవరం వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివ సాయి నివాళులర్పించారు.

టిడిపి పూర్వవైభవానికి కృషి

ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీరామినేని జయరాం నాయుడు

ప్రజాశక్తి - రామసముద్రం

తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని ప్రముఖ పారిశ్రామిక వేత్త, టిడిపి నాయకులు శ్రీరామనేని జయరాం నాయుడు పేర్కొన్నారు. రామసముద్రం మండలంలో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. మానేవారిపల్లి పంచాయతీ నాగనపల్లి గ్రామంలో కృష్ణమూర్తి స్వగృహంలో ఓ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాలేనత్తం పంచాయతిలోని తెదేపా సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డిని కలిసి పార్టీ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని గెలిపించి మదనపల్లె కంచుకోటకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని అధికారంలోకి రావడం ద్వారానే రాష్ట్ర ప్రజలు సురక్షితంగా ఉంటారన్నారు. అనంతరం కమ్మవారిపల్లి పంచాయతి ఎర్రబోయనపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వెంకటప్ప అన్న పెద్ద వెంకటప్ప స్వర్గస్తులైనారు. పెద్ద వెంకటప్ప మృతదేహానికి నివాళులర్పించి ఆయన కుటుంబం సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి శివ శంకర, తెదేపా మాజీ మండల అధ్యక్షులు కృష?ంరాజు, సర్పంచ్ ఇంజం వెంకటరమణ, మాజీ ఎంపీటీసీలు చలపతి నాయుడు, నరసింహులు, ఇలియాజ్ బాషా, డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నేత జయరాంనాయుడు

వర్షం వస్తే ఊరంతా నీరే....

- చెరువులను తలపిస్తున్న పట్టణ వీధులు
- పట్టని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణంలో వర్షం వస్తే వరద నీటిలో కాలువ ఏదో దారి ఏతో కనుక్కోవడం చాలా కష్టం. భారీ వర్షం వస్తే పట్టణం మునిగి పోతుంది. ఏదైనా నష్టం వాటిల్లితే అధికారులు వచ్చి పరిశీలించడం షరా మామూలుగా మారింది. సమస్య మాత్రం సమస్యగానే ఉంది. పుల్లంగేరు, చక్రాలమడుగులలో ఆక్రమణలే. ఆక్రమణలు తొలగించాలని పలువురు చేస్తున్న విన్నపాలను పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సిన ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా పట్టణంలోని ప్రధాన తపాల కార్యాలయం, ఆర్అండ్‌బి బంగ్లా వీధి, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, ఇండేన్ గ్యాస్ నుంచి పాత బస్టాండ్ వరకు గల ప్రధాన రహదారులకు సమీపంలోని ప్రజలు వాన వస్తే ఇంటి నుంచి బయటికి అడుగు పెట్టాలన్నా జంకుతారు. ఈ ప్రాంతాలలో తేలికపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయమై మురుగు నీరుతో కలిసిపోయి చిన్నపాటి వంకల్లా దర్శనమిస్తాయి. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, డ్రెయినేజీ వ్యవస్థ ఉన్నా వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలతో డ్రెయినేజీ కాలువలలో పూడికలు తీయడం వంటి చర్యలు చేపట్టకపోవడం, ఆక్రమణలు కారణంగా తేలికపాటి వర్షాలకే పట్టణంలో రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతాలలో మురుగునీటి సమస్య అధికమై వర్షపు నీరు డ్రెయినేజీ నీటితో కలిసి రోడ్లపైన అస్తవ్యస్తంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపైన మురుగు నీటితో వర్షపు నీరు చేరిపొంగి పొర్లుతున్నాయి. వ్యాపారస్తులు, దుకాణదారులు, ప్రజలు మురుగు నీటి వలన తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ప్రధాన తపాలా కార్యాలయం, కసాయి వీధి, గ్రంథాలయం ప్రాంతాలలో ప్రధానంగా ఈ సమస్య ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగానే మిగిలిపోయింది. మున్సిపల్ పాలకవర్గం ఏర్పడినా ఈ సమస్య పరిష్కారం కాకపోవడంతో పాలకవర్గం ఈ సమస్య పైన దృష్టి సారించలేదని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా వాన కష్టాల నుంచి తమను గట్టెక్కించాలని, పాలకవర్గంతోపాటు సంబంధిత అధికారులు సమస్య పైన స్పందించి చర్యలు చేపట్టి ఇందుకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అగ్నిమాపక కార్యాలయం వద్ద జలయమైన ప్రధాన రహదారి

ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పక ధరించాలి : సిఐ



రికార్డులను పరిశీలిస్తున్న సిఐ బి.ఎన్.సురేష్, ఎస్ఐ బిందుమాధవి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాహనాలు నడిపేటప్పుడు పలు జాగ్రత్తలు పాటించడం వలన మన ప్రాణాలను మనమే కాపాడుకోవచ్చునని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వాల్మీకిపురం సిఐ బి.ఎన్.సురేష్ సూచించారు. ఆదివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించి, ద్విచక్రవాహనదారులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మోటర్ సైకిల్, తదితర వాహనాలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలన్నారు. చిన్న వయసులోనే (మైనర్లు) వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు, వాహనానికి సంబంధించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మోటర్ సైకిల్‌పై వెళ్లే వారు హెల్మెట్‌ను కచ్చితంగా వాడాలని, వాహనాలకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కొంత మంది సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ.. ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పరిమితికి మించిన వేగంగా వాహనాన్ని నడపకూడదని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనదారులు సహకరించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తమ వాహనాలకు సంబంధించిన వాహనాల రికార్డులను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, లైసెన్సులు, రికార్డులు లేకపోయినా వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కారులో వెళ్లేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ బిందుమాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేద్దాం : ఆర్‌బికె చైర్మన్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గ్రామ స్థాయి నుంచి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేద్దామని రైతు భరోసా కేంద్రం చైర్మన్ నీళ్లభాస్కర్ అన్నారు. ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయంలో జిల్లా అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ యశోద ఆధ్వర్యంలో వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ మండలాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగును మూడు మండలాల్లోని రైతులందరూ చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర చాలా ముఖ్యమన్నారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహనలు కల్పించడం, రైతుల సందేహాలను నివృత్తి చేయడం, ప్రకృతి వ్యవసాయంపై సలహాలు, సూచనలు చేయడం వలన రైతులు ఉత్సాహంగా ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతారన్నారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ప్రకృతి వ్యవసాయాన్ని చేయించాలన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ బోర్డు సభ్యులు బోడోషావలీ మాట్లాడుతూ వరి పంటకు నాలుగు రోజులకు ఒక్కసారి జీవామృతం పారించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులందరూ పెరటి తోటల్లో కూరగాయలను పండించేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రకృతిలో పండించిన చింతపండు, వరి ధాన్యంను తిరుమల తిరుపతి దేవస్థానంకు విక్రయించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన రైతులకు పెట్టుబడులు తగ్గి అధిక ఆదాయం పొందవచ్చునని సూచించారు. ఎంటిలు శ్రీనివాసులు, జ్యోతి, పిఆర్‌పి పెద్ద రెడ్డెయ్య, ఎల్2లు స్వాతి, హేమలత, రమేష్ కుమార్ రెడ్డి, అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌బికె చైర్మన్ నీళ్లభాస్కర్

ఆర్ఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే అక్రమ కేసులు



రాయచోటి : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

రాజకీయ జీవితంలో మచ్చలేని వ్యక్తి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్. రమేష్ కుమార్‌రెడ్డి అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయం ఎదుట నాయకులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఖాదర్ బాషా మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఎంపిపి సుదర్శన్‌రెడ్డి ఇద్దరు రాజకీయంగా రమేష్‌కుమార్‌రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక ఎస్‌సి, ఎస్‌టి కేసులు అక్రమంగా నాయించడం నీతిమాలిన చర్య అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి, టిడిపి నాయకులు కొట్టే చలపతి, అబూజార్ హుసేన్, మమబూబ్ అలీ, సత్యరెడ్డి, గన్‌మెన్‌రాజు జావీద్, మైనుద్దీన్, అతావుల్లా, రెడ్డయ్య, సాయి, పాల్గొన్నారు. **రామాపురం:** రమేష్‌కుమార్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు బనాయించడం నీతి మాలిన చర్య అని జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు కొవ్వూరి దివ్య కుమార్‌రెడ్డి, మండల టిడిపి సీనియర్ నాయకుడు కొవ్వూరు ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే చర్యకు ప్రతి చర్య తప్పకుండా ఉంటుందని చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు వాసుదేవారెడ్డి, నీలకంఠరెడ్డి, వెంకట్రామి రెడ్డి, సిగ రాజా, బాబు, అంజినేయులు రెడ్డి, రామాపురం మండల తెలుగు యువత అధ్యక్షుడు నాగ భూషణ్ రెడ్డి, చిన్న వీరనాగి రెడ్డి మదనమోహన్ యువరాజ్ చాన్ బాషా పాల్గొన్నారు. **చిన్నమండెం :** రమేష్‌కుమార్‌రెడ్డిపై కేసులు బనాయించడం పిరికిపంద చర్య అని, వెంటనే అక్రమ కేసులు ఎత్తి వేయాలని టిడిపి మండల అధ్యక్షులు నరసింహారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** రమేష్‌రెడ్డిని ఎదుర్కోలేక ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు బరాయించడం సిగ్గుచేటని మాజీ మార్కెట్ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర బిసి కార్యదర్శి శంకరపు జయరామ ప్రభుత్వాన్ని విమర్శించారు. వారు మాట్లాడుతూ ఎన్ని కేసులు బనాయించినా ఆర్ఆర్ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. కార్యక్రమంలో మద్దిలేవుల దప్పేపల్లి సర్పంచులు చంద్రమ్మ అహల్య కేశవులు ఎంపిటిసి రవణమ్మ మాజీ జడ్‌పిటిసి మోహన్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, చంద్రాయుడు, శంకర్, వాసుదేవుడు, రహంతుల్లా, మాజీ సర్పంచ్ రెడ్డన్న పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ప్రధాన కార్యదర్శిగా రాజేంద్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సెక్రటరీగా రంగు రాజేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లికు చెందిన సీనియర్ డాక్యుమెంట్ రైటర్ రంగు రాజేంద్ర హ్యూమన్ రైట్స్ విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షునిగా, కో-ఆర్డినేటర్‌గా, రాయలసీమ అధ్యక్షునిగా రెండుసార్లు ఎంపికయ్యారు. తాజాగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్టులో రాష్ట్ర స్థాయిలో పదవి చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర, అక్రమాల నియంత్రణలో ప్రభుత్వ సహాయ సహకారాలు తీసుకుంటూ ముందుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా రంగు రాజేంద్రను డాక్యుమెంట్ రైటర్లతో పాటు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ట్రస్ట్ సభ్యులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలకడ

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం దేవపట్ల నందు తిరుపతి పట్టణంలో వెలసిన సంకల్ప సూపర్ స్పెషాలిటీ వైద్యశాల బృందం చే ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ ఉచిత వైద్య శిబిరం నందు సుమారు 500 మంది పైన వచ్చి చికిత్స చేపించుకున్నారు. వారందరికి గుండె, ఎముకల, మానసిక మరియు చర్మవ్యాధి నిపుణులు చికిత్సలు చేసి, షుగర్, బీపీ టెస్టులు కూడా చేసి, అవసరం అగు మందులు సరఫరా చేసారు. అనంతరం సంకల్ప హాస్పిటల్ బృందం వేణుగోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, చిదంబరరెడ్డిలకు దుస్సాలువలతో, మేమేంటోలతో సత్కరించి ఆదరించినందుకు హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు చిదంబరరెడ్డి, ప్రముఖ వైసిపి నాయకుడు కాంట్రాక్టర్ ఆవుల మల్లిఖార్జునరెడ్డి, సర్పంచిలు వేణుగోపాల్‌రెడ్డి, ఉదయకుమారరెడ్డి, పాల వెంకటరమణ, మండల ఉపాధ్యక్షులు రవీంద్రనాయుడు, యువరాజనాయుడు, నాయుకులు గుండ్లూరి హేమంత్ రెడ్డి, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు 'బీరం' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప మున్సిపల్ మైదానంలో డిఎస్ఎ ఆధ్వర్యంలో ఎస్‌జిఎఫ్ఐ నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ అండర్-17 విభాగంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.మధు, అండర్-14 విభాగంలో ఎనిమిదవ తరగతి చదువుతున్న గౌతమ్ అనే విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కరస్పాం డెంట్ సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించి, తమ సంస్థ సాధిస్తున్న వరుస విజయాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత మాట్లాడుతూ విద్యార్థులకు చక్కటి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి తమ విద్యా సంస్థను ఉన్నత స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు.



విరాళం అందజేస్తున్న దాత నరసింహా

సేవా సంస్థకు రూ.25 వేల వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక బర్మావీధిలోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు సుహాస్ ఉదవి ఫౌండేషన్ ఫౌండర్, మిట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫైసర్ నరసింహ, వారి మిత్ర బృందంతో కలిసి ఎడ్యుకేషన్ సపోర్ట్ నిమిత్తం రూ.25 వేల వితరణ చేశారు. ఆదివారం నగదును చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థకు అందజేశారు.

వీధిలైటు ఏర్పాటు చేయండి సారూ...!

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వీధిలైటు లేక విషసర్పాలు ఇండ్లల్లోకి వస్తున్నాయని, వీధిలైట్ వేయాలని పలుమార్లు అధికారులకు సర్పంచ్‌కు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోయారు. మండలంలోని టిఎన్ఆర్ కాలనీ పలేటమ్మగుడి వెనుక ఉన్న వీధిలో ఆరు నెలల క్రితం వీధిలైటు వెళ్ళగకుండా పోయాయి. అక్కడ నివసిస్తున్న స్థానికులు వీధిలైటు వేయాలని, వీధిలైట్ లేకపోవడం వలన విష సర్పాలు ఇండల్లోకి వస్తున్నాయని పలుమార్లు సర్పంచ్‌కి, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి వీధిలైటు వద్ద బురదమయం కావడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, బురదకు వాహనాలు అదుపుతప్పి కిందపడి గాయాల పాలవుతున్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధిలైటు వేయాలని స్థానికులు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- పెద్దమండ్యం

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. 40 మంది విద్యార్థులు కలిసి తమ పాఠశాలలో చదివిన రోజులను, తీపి గుర్తులను గుర్తు చేసుకొన్నారు. అనంతరం ప్రస్తుతం వారు చేస్తున్న వృత్తి, కుటుంబ సభ్యుల వివరాలతో పరిచయం చేసుకొన్నారు. అనంతరం పాఠశాలలో నిర్మించే సమావేశ ప్రాంగనానికి తమ వంతుగా రూ.లక్ష విద్యార్థులందరు కలసి ప్రధానోపాధ్యాయులు రామకృష్ణకు అందజేశారు. ఈ సమావేశానికి ఎంపిపి రమేష్, జడ్‌పిటిసి, సర్పంచు తదితరులు హాజరై పాఠశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రెడ్డెప్ప, రామాంజులు, కుళ్లాయి రెడ్డి, గంగులప్ప, రామిరెడ్డి, కవిత, విజయ, సౌభాగ్యవతి, శంకర, రాజేంద్ర తదితరులు హాజరయ్యారు. స్నేహితులలో ఎవరికి ఇబ్బంది వచ్చినా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఆదుకొంటామని పేర్కొన్నారు.



పాఠశాలకు విరాళం ఇస్తున్న పూర్వ విద్యార్థులు

క్రైం కార్నర్



పట్టుబడిన సారా, మహిళతో ఎస్ఇబి బృందం

నాటు సారాతో సహా మహిళ అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పీలేరు ఎస్‌ఈబి సిఐ వై.గురుప్రసాద్ తెలిపారు. ఆదివారం సమాచారం మేరకు కెవి.పల్లి మండలం వడ్లకుంట గ్రామంలో దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ఎం.కళావతి 10 లీటర్ల సారా కలిగి ఉండగా అరెస్టు చేసి, కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో పీలేరు ఎస్ఇబి ఎస్ఐ లక్ష్మి నరసయ్య, సిబ్బంది, ఎస్ఇబి ఎఎస్‌పి స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలు

ఇద్దరి చిన్నారుల పరిస్థితి విషమం

ప్రజాశక్తి చిన్నమండెం

మండల పరిధిలోని కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలయ్యాయి. వివరాలు.. ఆదివారం ఉదయం మండలంలోని చిన్నరస్పుపల్లెకు చెందిన పరస రవి తన భార్య భాగ్యమ్మ, ముగ్గురు పిల్లలు చైతన్య, భవిత, శ్రీవిద్యతో కలసి రెడ్డివారిపల్లె హరిజనవాడలోని అత్తగారి ఇంటికి టివిఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై బయలు దేరాడు. అత్తగారింట్లో ఎవరూ లేకపోవడంతో పొలం వద్దకు పయనమయ్యారు. మార్గ మధ్యలో రెడ్డివారిపల్లె వద్ద మదనపల్లె నుంచి రాయచోటి వెళ్లే కారు ఎక్స్‌ఎల్ వాహనాన్ని ఢీకొంది. దీంతో అదుపు తప్పి మరో కారును ఢీకొనడంతో అందరూ చెల్లాచెదరుగా రోడ్డుపై పడ్డారు. ప్రమాదంలో రెండు కారుల్లోని ప్రయాణికులకు, ద్విచక్ర వాహనం దారులు మొత్తం 11 మందికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి చిన్నారులు చైతన్య, భవితకు తీవ్రగాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు పేర్కొన్నారు.



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కార్లు, (ఇన్‌సెట్‌లో) గాయపడిన క్షతగాత్రులు